

మంత్రి దయాకర్‌రావును సత్కరించి మెమెంటో అందిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

## మంత్రి ఎర్రబెల్లిని కలిసిన ములుగు జిల్లా బీఆర్ఎస్ శ్రేణులు

ములుగురూరల్, అక్టోబర్ 1: ములుగు జిల్లాలోని మల్లంపల్లిని ప్రత్యేక మండలంగా సీఎం కేసీఆర్ ప్రకటించడంపై హర్షం వ్యక్తం చేస్తూ జిల్లాకు చెందిన బీఆర్ఎస్ నాయకులు ఆదివారం సాయంత్రం రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావును హనుమకొండలోని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. మండల ఏర్పాటుకు కృషి చేసినందుకు ధన్యవాదాలు తెలిపి, శాలువాతో సత్కరించి మెమెంటో అందజేశారు. మంత్రి దయాకర్‌రావును కలిసిన వారిలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మీనర్సింహారావు, జిల్లా గంథ్రాలయ సంస్థ చైర్మన్ గోవింద్‌నాయక్, మల్లంపల్లి సర్పంచ్ చంద కుమారస్వామి, ఎంపీటీసీ మాచర్ల ప్రభాకర్, నాయకులు కాకులమర్రి ప్రదీప్‌రావు, వలీబాబా తదితరులు ఉన్నారు.

### లక్ష్మీబరాజ్‌లో తగ్గిన వరద

**ఇన్‌ఫ్లో, అవుట్ ఫ్లో 1,08,500 క్యూసెక్కులు**

మహదేవపూర్, అక్టోబర్ 1 : మండలంలోని అంబట్‌పల్లి గ్రామంలో లక్ష్మీబరాజ్‌లో వరద ప్రవాహం తగ్గింది. ఆదివారం బరాజ్ ఇన్‌ఫ్లో 1,08,500 క్యూసెక్కుల వరద రాగా, బరాజ్‌లోని మొత్తం 85 గేట్లు ఎత్తి అంతే మొత్తంలో దిగువకు వదులుతున్నట్లు భారీ నీటి పారుదలశాఖ డీఈఈ సురేశ్ తెలిపారు. బరాజ్ ప్రస్తుత నీటిమట్టం 2.90మీటర్లు ఉన్నదన్నారు.

# జిల్లా దవాఖానలో 'ఫీవర్ క్లినిక్'

- వ్యాధులేవైనా చికిత్సకు సర్వం సిద్ధం
- విషజ్వరాల బాధితులకు ప్రత్యేక వార్డు
- చికిత్సలకు ప్రత్యేక వైద్య బృందం
- 44 మందికి అందుతున్న ట్రీట్‌మెంట్
- పెరుగుతున్న ఓపీ కేసులు
- టీ హబ్‌లో ఎలీసా పద్ధతిలో నాణ్యమైన పరీక్షలు
- ఆరోగ్య కేంద్రాల్లోనూ సెల్ కౌంటర్
- ప్రైవేట్‌లో ఇష్టారాజ్యంగా రోగనిర్ధారణ పరీక్షలు



జిల్లా వైద్యశాలలోని ప్రత్యేక వార్డులో చికిత్స పొందుతున్న రోగులు

జయశంకర్ భూపాలపల్లి, అక్టోబర్ 1(నమస్తే తెలంగాణ) : వాతావరణంలో మార్పులతో జిల్లాలో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయి. డెంగీ, మలేరియా కేసులు పెరుగుతుండడంతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. ప్రభుత్వ దవాఖానలో ప్రత్యేక వైద్యచికిత్స, వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. బాధితులకు తక్షణమే వైద్యసేవలు అందే విధంగా అన్ని ఏర్పాట్లు చేస్తూ, అవసరమైన మందులను అందుబాటులో ఉంచారు. ప్రస్తుతం పరిస్థితి అదుపులో ఉందంటున్న వైద్యులు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని ప్రజలకు సూచిస్తున్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని ప్రధాన దవాఖానలో ఫీవర్ క్లీనిక్‌ను ఏర్పాటు చేశారు. హాస్పిటల్‌లో విషజ్వరాలు, డెంగీ, మలేరియా వ్యాధిగ్రస్తులకు ప్రత్యేక వార్డు ఏర్పాటు చేసి 44 మందికి చికిత్స అందిస్తున్నారు. వీరిలో ఐదుగురు డెంగీ వ్యాధికి ట్రీట్‌మెంట్ తీసుకుంటున్నారు. దవాఖానలో ఓపీల సంఖ్య గణనీయంగా పెరుగుతున్నది. కాగా, ప్రత్యేక వార్డుల్లో చికిత్స అందించేందుకు దవాఖాన సూపరింటెండెంట్ కోడూరి నవీన్‌కుమార్ ప్రత్యేక వైద్య బృందాన్ని ఏర్పాటు చేశారు. ప్రతి రోగిపై ప్రత్యేక దృష్టి సారిస్తూ, ఎప్పటికప్పుడు టీ హబ్‌లో ఎలీసా పద్ధతిలో నాణ్యమైన పరీక్షలు చేయిస్తూ ట్రీట్‌మెంట్ చేస్తున్నారు. చాలా మంది ప్రైవేట్ హాస్పిటల్‌ను ఆశ్రయిస్తూ అక్కడ నిర్వహించే నాసిరకం పరీక్షలతో వ్యాధి ఉందో.. లేదో.. తెలియక ఆందోళనకు గురవుతున్నారు. జేబులు గుల్లా చేసుకుంటున్నారు. జిల్లాలోని 13 ఆరోగ్య కేంద్రాల్లోనూ ఉచిత పరీక్షలు చేస్తూ చికిత్స అందిస్తున్నామని, జిల్లా వైద్యశాలలో పూర్తిస్థాయి వైద్యసేవలు అందుతుండగా ప్రైవేట్‌కువెళ్లి నష్టపోవద్దని సూచిస్తున్నారు.

**ప్రత్యేక వైద్య బృందం**

జిల్లా దవాఖానలో సూపరింటెండెంట్ నవీన్‌కుమార్ ప్రత్యేక వైద్య బృందాన్ని ఏర్పాటు చేసి డెంగీ, మలేరియా విష జ్వరాలకు చికిత్స అందిస్తున్నారు. పీడియాట్రీషియన్, జనరల్ మెడిసిన్, పాథాలజీ, ఎపిడమిక్ టీమ్‌ను ఏర్పాటు చేసి ప్రత్యేక వార్డులో చికిత్స అందిస్తున్నారు. జిల్లాలోని 13 పీహెచ్‌సీలు, రెండు సీహెచ్‌సీల్లోనూ డెంగీ, మలేరియా, సాధారణ వ్యాధులకు చికిత్స అందిస్తున్నారు. పీహెచ్‌సీల్లో ఏర్పాటు చేసిన సెల్ కౌంటర్ల ద్వారా 23 రకాల పరీక్షలు ఉచితంగా చేస్తున్నారు. అవసరమైతే అక్కడి నుంచి ప్రత్యేక వాహనం ద్వారా శాంపిల్స్‌ను జిల్లా కేంద్రంలోని టీహబ్‌కు పంపుతున్నారు. ఇదిలా ఉండగా ప్రతి మంగళవారం ఆరోగ్య కేంద్రాల్లో నిర్వహించే ఆరోగ్య మహిళ కార్యక్రమం ద్వారా చాలామంది మహిళలకు వ్యాధులను ముందే గుర్తించి చికిత్స అందిస్తునారు. పీహెచ్‌సీ, సీహెచ్‌సీ, జిల్లా దవాఖానలో ఎప్పటికప్పుడు నమోదవుతున్న వ్యాధుల వివరాలను వారానికోసారి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ప్రభుత్వానికి నివేదిస్తున్నారు. దీన్ని బట్టి సరిపడా మందులు, కెమికల్స్‌ను రాష్ట్ర ప్రభుత్వం అందుబాటులో ఉంచేలా చర్యలు చేపడుతున్నది. అన్ని ప్రభుత్వ దవాఖానల్లో సరిపడ మందులు ఉన్నాయని డీఎంహెచ్‌వో డాక్టర్ శ్రీరాం తెలిపారు. ప్రభుత్వం ఇప్పటి వరకు పంపిన నివేదికలో జిల్లాలో 37 డెంగీ కేసులు, మూడు మలేరియా కేసులు నమోదయ్యాయని తెలుపుతున్నారు. డెంగీతో ఎవరూ చనిపోలేదని, వ్యాధిగ్రస్తులకు చికిత్సఅందించి ఆరోగ్యంగా ఇంటికి పంపుతున్నామని తెలిపారు.

**ప్రత్యేక వైద్య చికిత్సలు**



జిల్లా దవాఖానలో విషజ్వరాలు, డెంగీ, మలేరియా వ్యాధులకు ప్రత్యేక చికిత్స అందిస్తున్నాం. పిడియాట్రీషియన్, జనరల్ మెడిసిన్, పాథాలజీ, ఎపిడమిక్ వైద్యులతో ప్రత్యేక బృందాన్ని ఏర్పా టు చేశాం. ఇక్కడ డెంగీ నిర్ధారణ అథెంటిక్‌గా జరుగుతున్నది. ప్రభుత్వం సర్టిఫై చేసిన ఎలీసా పద్ధతి ద్వారా టీ హబ్‌లో వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేసి చికిత్సలు అందిస్తున్నాం. ప్రభుత్వ ద వాఖానల్లో మెరుగైన చికిత్సలు అందుతున్నాయి. ప్రజలు ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లి మోసపోవద్దు.

*–కోడూరి నవీన్‌కుమార్, జిల్లా దవాఖాన సూపరింటెండెంట్*

## ప్రైవేట్ దవాఖానలపై ప్రత్యేక నిఘా

- డెంగీ పేరుతో అధిక దోపిడీ
- కాటారం ఏరియా దవాఖానలపై అధిక ఫిర్యాదులు
- డీఎంహెచ్‌వో డాక్టర్ శ్రీరాం



జయశంకర్ భూపాలపల్లి, అక్టోబర్ 1(నమస్తే తెలంగాణ) : జిల్లాలో ప్రైవేట్ దవాఖానలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శ్రీరాం తెలిపారు. ఆయన 'నమస్తే తెలంగాణ'తో మాట్లాడారు. ప్రస్తుతం సీజనల్ వ్యాధులు ప్రబలుతుండడంతో ప్రైవేట్ దోపిడీ పెరిగిపోతుందన్నారు. కొన్ని దవాఖానల్లో ఇష్టారాజ్యంగా పరీక్షలు చేస్తూ వ్యాధులు లేకున్నా.. ఉన్నట్లు నాసిరకం యంత్రాలతో పరీక్షలు చేస్తూ ప్రజలను ఆర్థికంగా ఇబ్బందులకు గురిచేస్తున్నారని తెలిపారు. భూపాలపల్లి, కాటారం ఏరియాల నుంచి అనేక ఫిర్యాదులు వచ్చాయని, కాటారం ఏరియాలోని కొన్ని ప్రైవేట్ దవాఖానలపై అధికంగా ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. ఆర్ఎంపీ వైద్యులు సైతం రోగ నిర్ధారణ పరీక్షలు చేస్తూ అమాయక ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. గణపురం మండల కేంద్రంలో ఒక ఆర్ఎంపీ వైద్యుడు ప్రత్యేక ల్యాబ్‌ను ఏర్పాటు చేసి రోగనిర్ధారణ పరీక్షలు చేస్తుంటే సమాచారం మేరకు సీజ్ చేసి, కేసు నమోదు చేయించామన్నారు. జిల్లాలోని ప్రైవేట్ దవాఖానల్లో ఆకస్మిక తనిఖీలు చేసి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ విషయమై ప్రైవేట్ ఆస్పత్రుల డాక్టర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. ప్రజలు ప్రభుత్వ వైద్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ప్రైవేట్‌కు వెళ్లి ఆందోళనకు గురికావద్దన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రధాన దవాఖానలో అన్ని రకాల వైద్య చికిత్సలు అందిస్తున్నామని, టీ హబ్‌లో నాణ్యమైన వైద్యపరీక్షలు చేస్తున్నారని, పీహెచ్‌సీల్లోనూ సెల్ కౌంటర్ ద్వారా 23 రకాల పరీక్షలను ఉచితంగా అందిస్తున్నారని, ఈ అవకాశాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

### భూపాలపల్లి నుంచి విమానాశ్రయానికి సూపర్ లగ్జరీ సర్వీస్

హనుమకొండ చౌరస్తా, అక్టోబర్ 1: ఆర్టీసీ ప్రయాణికుల కోసం భూపాలపల్లి నుంచి హనుమకొండ మీదుగా రాజీవ్‌గాంధీ విమానాశ్రయం, శంషాబాద్‌కు కొత్త సూపర్ లగ్జరీ సర్వీసు ప్రారంభించినట్లు ఆర్టీసీ ఆర్ఎం జే శ్రీలత తెలిపారు. ఈ సర్వీసు భూపాలపల్లిలో ఉదయం 5 గంటలకు బయల్దేరి హనుమకొండకు 6.30గంటలకు చేరుకుంటుందన్నారు. హనుమకొండ బస్టాండ్‌లో ఉదయం 7 గంటలకు బయల్దేరి శంషాబాద్ విమానాశ్రయానికి 10:25 గంటలకు చేరుకుంటుందన్నారు. ప్రయాణ చార్జీలు హనుమకొండ నుంచి విమానాశ్రయానికి రూ.530, భూపాలపల్లి నుంచి విమానాశ్రయానికి రూ.640గా నిర్ణయించినట్లు చెప్పారు. ఈ బస్సు మళ్లీ శంషాబాద్ విమానాశ్రయం నుంచి మధ్యాహ్నం 12 గంటలకు బయల్దేరి హనుమకొండ మీదుగా భూపాలపల్లికి సాయంత్రం 6:05 గంటలకు చేరుకుంటుందని, ప్రయాణికులు ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని కోరారు.

## సోషల్ మీడియాలో తప్పుడు పోస్టులు పెడితే చర్యలు

**ఎస్పీ పుల్లా కరుణాకర్**

భూపాలపల్లి రూరల్, అక్టోబర్ 1: సోషల్ మీడియాలో విద్వేషకర, రెచ్చగొట్టే, తప్పుడు పోస్టులు పెట్టవద్దని జయశంకర్ భూపాలపల్లి ఎస్పీ పుల్లా కరుణాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. అలాంటి వారిని పోలీసులు నిరంతరం గమనిస్తున్నారని, చట్ట ప్రకారం కేసులు పెట్టి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సామాజిక మాధ్యమాల్లో అసభ్యకరమైన చిత్రాలు, వీడియోలు పోస్టు చేయొద్దని, వ్యక్తిగత దూషణకు దిగడం, వార్నింగ్ ఇవ్వడం, అంతర్గత వివరాల గురించి అనవసర పోస్టులు, కామెంట్స్ పెట్టవదన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే విధంగా వాట్సాప్, ఫేస్‌బుక్, ట్విట్టర్, ఇన్‌స్ట్రాగ్రాం, టెలీగ్రామ్, యూట్యూబ్ వంటి సామాజిక మాధ్యమాలను వేదికగా చేసుకొని తప్పుడు ప్రచారాలు చేయవద్దన్నారు. పోస్టులు చేసేటప్పుడు అప్రమత్తతో వ్యవహరించాలని, లేదంటే తగిన పర్యావసనాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని, అనవర పోస్టులు పెట్టి యువత తమ భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని సూచించారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS

WANTED

jobs Apply Now!

★ICICI, HDFC, AXIS, INDUSLND బ్యాంక్స్ క్రెడిట్ కార్డ్స్ సేలింగ్ కోసం ఎక్స్‌పీరియన్స్ & ఫ్రెషర్స్ లేడి టెలికాలర్స్ కావలెను. సాలరీ+ఇన్సెంటివ్స్, జాబ్ లోకేషన్–హన్మకొండ. సెల్: 8886188690. NTW-5678

★రామకృష్ణ గ్రూప్ Hyd, VJA శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల సేవకు, బేబి కేర్, ఇంటి/ వంటపని చేయుటకు వర్కర్స్ కావలెను. భో|| + వ|| + జీతం: 15–22 వేలు. ఏజెంట్లకు 5000/– కమీషన్. ఫోన్: 9281452833, 9281452844. NT-310380

RENT



★వరంగల్ బీటుబజార్ అయ్యగారి దొడ్డి ఎదురు గల్లీలో గ్రౌండ్ ఫ్లోర్‌లో 2,000 Sft. గలది. కిరాయికి ఇవ్వబడును. ఆఫీసులకు, షాపులకు, గోదాములకు అనువైనది. సంప్ర: 9700386212. NTW-321567

అతి తక్కువ ఖర్చు అత్యధిక ప్రచారం

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS

4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే
ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే
ప్రకటనల విభాగం : 9182777552

| HANAMKONDA | WARANAGAL |
|---|---|
| 9182777563 | 9182777556 |
| 9182777618 | 9182777557 |
| 9182777213 | 9182777558 |

JAYASHANKAR BHUPALPALLY - 9182777559
MULUGU - 9182777135
MAHABUBABAD - 9182777554
JANGAON - 9182777565